క్లుప్తంగా

విశాఖ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లకు సత్కారం



పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్లను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు విజయకుమార్ ప్రసాద్, పవన్ కుమార్ జాస్తిలను శుక్రవారం ఈపీఎస్ 95 పెన్షన్ వారియర్స్, ఉక్కు అధికారుల సంఘం(సీ) నాయకులు సత్కరించారు. విజయకుమార్ ప్రసాద్ భువనేశ్వర్‌కు, పవన్ కుమార్ జాస్తి బెంగళూరు బదిలీపై వెళ్తున్న సందర్భంగా నాయకులు ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో కలిసి శాలువాలు కప్పి, పూల మొక్కలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పూర్తి వేతనంపై ఈపీఎస్ 95 పెన్షన్ మంజూరు తదితర సమస్యల పరిష్కారానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్, టి.శ్రీనివాసరావు, పదవీ విరమణ అధికారులు దుద్దు శ్రీనివాస్, జె.ఎ.స్వామి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు ఐఎన్‌టీయూసీ మద్దతు



మద్దతు తెలియజేస్తున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఈ నెల 16న తలపెట్టిన సమ్మెకు ఐఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యనిర్వాహక సంఘం అధ్యక్షుడు కె. వంశీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో స్టీల్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని వెల్లడించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ మెడికల్ టెస్టుల పేరిట కాంట్రాక్ట్ కార్మికులను వేధించడం, తొలగించడం వంటి చర్యలను యాజమాన్యం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో రమణమూర్తి, ప్రభాకరరెడ్డి, వెంకన్న, బి.అప్పారావు, కె.అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి మళ్లింపుపై రగడ

- ప్రధాన కాలువకు అనుసంధానం చేసుకోవాలని డిమాండ్

అగనంపూడి: బహుళ అంతస్తుల్లో వాడకం నీటిని 86వ వార్డు ఫకీర్‌తక్యా ఎస్సీకాలనీ మీదుగా మళ్లించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫకీర్‌తక్యాలోని సన్‌రైజ్ సిటీ బహుళ అంతస్తు నిర్మాణ దారులు మురుగునీటి మళ్లింపు మార్గం చూపించకుండా సమీపంలోని ఎస్సీకాలనీ వీధి డ్రైనేజీకి అనుసంధానం చేయడంతో గ్రామస్తులు నిలదీశారు. ప్రధాన డ్రైనేజీకి అనుసంధానం చేయాలే తప్పా ఇలా వీధి రోడ్డులోని డ్రైనేజీకి అనుసంధానం చేయడం వల్ల దోమలు, దుర్గంధాన్ని ఎలా భరిస్తామని మండిపడ్డారు. బహుళ అంతస్తు ఫ్లాట్ల తరపున కార్పొరేటర్ కోటేశ్వరరావు వత్తాసు పలకడం సరికాదని మహిళలతో పాటు బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు నందికోళ్ల అప్పారావు నిరసన తెలిపారు. ఈవిషయంలో జీవీఎంసీ అధికారులు స్పందించాలని కోరారు.

హయ్యర్ పెన్షన్ రికార్డుల అందజేత



ఎమ్మెల్యే పల్లాకు రికార్డులు అందజేస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ఉద్యోగులు, కార్మికులకు పీఎఫ్ విషయమై రికార్డుల్లో 1992 సర్వీసు బదులు 1997గా నమోదైందని, మరి కొంత మందికి 2011గా నమోదైందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు గుర్తింపు యూనియన్ నాయకులు తెలిపారు. శుక్రవారం వ్యత్యాసం ఉన్న రికార్డులను ఆయనకు అందజేసి పీఎఫ్ కమిషనర్‌కు కలిసి కార్మిక, ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సుభాకర్ సాహూ, బొండ బాబూరావు, కొల్లి దేముడు, బి.రవీంద్రబాబు, వారణాసి గోవిందరావు, అలమండ వెంకటేశ్వరరావు, టి.ఎల్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



నేటి యువత అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువులే కాకుండా వెల్డింగ్ రంగంపై ఆసక్తి పెంచుకొంటున్నారు. సంప్రదాయ వెల్డింగ్‌తోపాటు హైటెక్ ఆటో మేటెడ్ పరికరాలను ఉపయోగించే పరిశ్రమలకు ఉపయోగపడే ప్రొఫెషనల్ వెల్డింగ్‌లోనూ నైపుణ్యం సాధిస్తున్నారు. వెల్డింగ్‌లో కెరీర్‌ను రూపొందించుకొని ముందుకు సాగుతున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సొంత ఫ్యాబ్రికేషన్‌లను ప్రారంభించి ఇంకొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. మరో కొంతమంది విదేశాల బాట పడుతున్నారు. - గాజువాక

యువత చూపు.. వెల్డింగ్ వైపు

సొంతంగా ఉపాధికి బాటలు

టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న యువత

మరికొంత మంది విదేశాలకు..

ఆదుకుంటున్న వెల్డింగ్ రంగం

ఉపాధి కల్పనకు దోహదం



గాజువాకలో 60కి పైగా వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. యువతకు వెల్డింగ్, ఫిట్టర్ వంటి ట్రేడ్‌లలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నాం. విదేశాల్లో ఉద్యోగాలు కల్పించడంలో రిజిస్ట్రేషన్లు లేని కొంతమంది నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. నిరుద్యోగులు ఈ విషయంపై ముందే సమాచారం తెలుసుకొని అసోసియేషన్లలో సభ్యత్వం ఉన్న సంస్థల్లో శిక్షణ తీసుకోవాలి. ఉపాధి కల్పిస్తామంటూ కార్యకలాపాలను సాగిస్తున్న సబ్ ఏజెంట్లను నిర్మూలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కరణం కనకారావు, రాజరాజేశ్వరి వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్

విదేశాల్లో పని చేసి వచ్చా



వెల్డింగ్‌లో సర్టిఫికెట్ కోర్సులు చేసిన తర్వాత దుబాయి, సింగపూర్ వంటి దేశాల్లో ఉద్యోగం చేసి వచ్చాను. ఇక్కడికి వచ్చి సొంతంగా ఫ్యాబ్రికేషన్ యూనిట్ పెట్టుకొన్నాను. ఇప్పుడు నేను కొంతమంది యువకులకు నావద్ద పని కల్పించాను. టెక్నికల్‌గా స్కిల్‌ను సాధించడం వల్లే ఆర్థికంగా నిలబడగలిగాను. సాంకేతిక విద్య మనకు ఎల్లప్పుడూ మంచే చేస్తుంది.

– జాగరపు శ్రీను, గాజువాక

యువతా బహుపరాక్

వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో శిక్షణ పొందడానికి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి యువకులు ఇక్కడికి వస్తున్నారు. అయితే వారి ఆతృతను కొంతమంది నిర్వాహకులు సొమ్ము చేసుకొంటున్నారు. వారికి సరైన శిక్షణ లేకుండా వెల్డర్లుగా విదేశాలకు పంపిస్తున్నారు. అక్కడ వారు విఫలం అవుతుండటంతో దేశం కాని దేశంలో అష్టకష్టాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు స్థానికంగా ఉన్న వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల అసోసియేషన్లు కలుగజేసుకొని కొంతమందికైనా న్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నా అప్పటికే నష్టం జరిగిపోతోంది. ఈ నేపథ్యంలో యువత పనిలో పూర్తిగా పట్టు సాధించిన తర్వాతే విదేశాల బాట పట్టాలని పలువురు సూచిస్తున్నారు.



వెల్డింగ్ శిక్షణలో యువకుడు



గాజువాకలో వెల్డింగ్ చేస్తున్న యువకులు

ఉపాధిరంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకనుగుణంగా యువత టెక్నికల్ స్కిల్స్‌ను అందిపుచ్చుకుంటోంది. చేతిలో పని (స్కిల్) ఉంటే ఎలాంటి సంస్థలైనా ఉపాధి కల్పిస్తాయని తెలుసుకుని ఇప్పుడు శిక్షణ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారికి ఉపాధి అవకాశాలు తలుపు తడుతున్నాయి. వెల్డింగ్, ఫిట్టర్ రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. దీంతో యువకులు ఈ కోర్సులపై మొగ్గు చూపుతున్నారు. రేపటి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడానికి గాజువాకలో వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు తమ కృషిని సాగిస్తున్నాయి. స్కిల్ ఉన్న వారిని పిలిచి మరీ ఉద్యోగాలు ఇస్తారని తెలుసుకుని యువకులు పోటీతత్వంతో ముందుకు సాగుతున్నారు. వీరికి వెల్డింగ్‌రంగం గొడుగు పడుతోంది.

సర్టిఫైడ్ కోర్సులకు డిమాండ్

ఉన్నత విద్యనభ్యసించినవారు సైతం ఉపాధి కోసం సాంకేతిక విద్యను ఎంచుకొంటున్నారు. అందులో భాగంగా వెల్డింగ్‌పై శ్రద్ధ చూపిస్తున్నారు. వెల్డింగ్‌లో సర్టిఫైడ్ కోర్సులను అభ్యసించి విదేశాల్లో సైతం ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. అలాంటి వారిని ప్రోత్సహించడంలో గాజువాకలోని వెల్డింగ్ శిక్షణా కేంద్రాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నాయి. ఆరు నెలలు, ఏడాది పాటు శిక్షణ పొందితే చాలు ఏ సంస్థ అయినా వెల్డర్‌గా పనిలోకి తీసుకుంటున్నాయి. ఇది నిరుద్యోగులకు వరంగా నిలుస్తోంది.

విదేశాల్లో ఉద్యోగాలు

ఉద్యోగం సంపాదించడం కోసం వెల్డింగ్ నేర్చుకుని సింగపూర్, దుబాయి, అబుదాబీ, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్లిన యువకులు పారిశ్రామిక ప్రాంతంలో అనేక మంది ఉన్నారు. ఇక్కడ నుంచి అధిక మంది యువకులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి కనబర్చుతుండడంతో వారి అవసరాలకనుగుణంగా వెల్డింగ్ శిక్షణా సంస్థలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి.

గాజువాకలో 60 శిక్షణ సంస్థలు

గాజువాక పట్టణంలో సుమారు 60 వరకూ వెల్డింగ్ శిక్షణ సంస్థలు ఉన్నాయి. 3జీ, 4జీ, 6జీ టిగ్, ఆర్క్, మిగ్ వెల్డింగ్‌లో శిక్షణ అందిస్తున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులై వారు, ఇంటర్, ఐటీఐ చేసిన వారిలో ఎక్కువ మంది వెల్డింగ్‌రంగంపై ఆసక్తి పెంచుకుని ప్రగతికి బాటలు వేసకుంటున్నారు. వారితోపాటు ఉన్నత విద్యనభ్యసించినవారు సైతం టెక్నికల్ ఎడ్యుకేషన్‌వైపు వెళ్తుండటంతో వెల్డింగ్‌కు విశేష ఆదరణ లభిస్తోందని వెల్డింగ్ శిక్షణ సంస్థల నిర్వాహకులు పేర్కొంటున్నారు.



వెల్డింగ్ నేర్చుకుంటున్న యువకుడు

మలేరియా నివారణ చర్యలపై ప్రచారం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

గాజువాక: మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గాజువాక పీహెచ్‌సీ, మలేరియా విభాగం సిబ్బంది శుక్రవారం చినగంట్యాడ ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వల్లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారానికో రోజు డ్రైడే పాటించాలని, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల నివారణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ, ఏఎంవో చిత్రాడ సత్యనారాయణ, సీహెచ్‌వో పి.నాగ అప్పారావు, ఎంపీహెచ్‌ఈవో బి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో రేపు బీజేపీ జెండా ఆవిష్కరణ

గాజువాక: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 6న గాజువాక నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల స్థాయిలో పార్టీ జెండాను ఆవిష్కరించనున్నట్టు ఆ పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. శ్రామికనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను, 13న నిర్వహించనున్న హిందూ మహాసభతో పాటు 14న నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు దీనకొండ కృష్ణంరాజు, లక్కరాజు సోంబాబు, వెన్నా శ్రీరామ్మూర్తి, వర్రి లలిత తదితరులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో మహిళకు న్యాయం చేశాం

సౌత్ ఏసీపీ త్రినాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సౌత్ ఏసీపీ త్రినాథ్

అక్కిరెడ్డిపాలెం: మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి ఆమెకు న్యాయం చేశామని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అన్నారు. ఇరు వర్గాలకు చెందిన గొడవలో ఓ మహిళ తనకు న్యాయం జరగలేదని పోలీస్ ఉన్నతాధికారులన ఆశ్రయించడంతో శుక్రవారం ఏసీపీ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఈ అంశంపై విలేకరులతో మాట్లాడారు. జక్కుల రోజా, జక్కుల శాంతి కుమారికి కొన్ని నెలలుగా కుటుంబ కలహాలు ఉన్నాయి. దానిలో భాగంగా కొద్ది రోజుల కిందట జక్కుల శాంతి కుమారి వర్గానికి చెందిన జక్కుల ప్రసాద్ పాతగాజువాక జంక్షన్‌లో రోజాను కామెంట్ చేయగా రోజా ప్రసాద్‌ను చెప్పుతో కొట్టింది. దీంతో జక్కుల ప్రసాద్ తన బట్టలు చింపి గాయాలయ్యేలా దాడి చేశాడని ఆరోపిస్తూ జక్కుల రోజా గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. అయినా రోజా తనకు పూర్తి న్యాయం జరగలేదని పోలీస్ ఉన్నతాధికారులను ఆశ్రయించింది. తనపై మరో ఇద్దరు దాడి చేశారని ఓ వీడియో చూపించింది. అందులో ఇద్దరు దాడి సమయంలో లేకపోవడంతో వారిని చేర్చలేదన్నారు. ఇరువురు మహిళలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా జక్కుల రోజాపై కేసు తీసేశామని, చట్టపరిధిలో ఆమెకు పూర్తి న్యాయం చేశామన్నారు. సమావేశంలో గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ ఎ.పార్థసారథి, ఎస్ఐ టి.రవికుమార్ పాల్గొన్నారు.

భానుడి భగభగ





భానుడు భగ భగమంటున్నాడు.. రోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. రోజువారీ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగి పెరిగిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చే వారు మాత్రం గొడుగులతో కనిపిస్తున్నారు. ఎండ దెబ్బకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం అయితే రహదారులన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే పరిస్థితి ఇలా ఉంటే మరి మే గురించి తలచుకుని బెంబేలెత్తిపోతున్నారు..

-పెదగంట్యాడ



శ్రీరామనవమికి రామాలయాలు ముస్తాబు



ముస్తాబైన దిబ్బపాలెం రామాలయం

అగనంపూడి: ఈ నెల 6న శ్రీరామ నవమి పురస్కరించుకొని 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ దిబ్బపాలెంలోని రామాలయాన్ని సిద్ధం చేశారు. ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పెళ్లిరాట ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ నవమి రోజున విశేష అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పరిశ్రమలకు 'స్కిల్' అవసరం



మాట్లాడుతున్న జోన్–1 ఆర్డీడీ రమణ

పెదగంట్యాడ: ఐటీఐలోని ఫిట్టర్, టర్నర్ ట్రేడ్ విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమయ్యే విధంగా శిక్షణ ఇవ్వాలని జోన్-1 ఆర్‌డీడీ ఆర్‌వి రమణ అన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్, టర్నర్ ట్రేడుల కరిక్యులమ్ మార్పు కోసం కోల్‌కతాకు చెందిన సీఎస్‌టీఏఆర్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు కొత్త స్కిల్ అవసరం ఉందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి విద్యార్థుల్లోని ప్రతిభ మరింత వెలికితీయాలని సూచించారు. పెరుగుతున్న ఉపాధి అవకాశాల దృష్ట్యా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, డాక్‌యార్డ్, రైల్వే, గంగవరం పోర్టు,కు చెందిన పలువురు పాల్గొని పలు సూచనలు చేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్: బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజా నాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని వారం రోజుల పాటు రాజ్యాంగ పరిరక్షణా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సీపీఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 5న బాబూ జగ్జీవన్ రామ్ జయంతి రోజు నుంచి వారం రోజుల పాటు కళా ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు, కోలాటం, తీన్మార్ డప్పులు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 13 ఉదయం 9 గంటలకు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకు డప్పు కళాకారులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. సినీ నటుడు, నిర్మాత, పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి పాల్గొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై. రాజు, నగర అధ్యక్షుడు టి. చిరంజీవి, ఎంవీ ప్రసాదరావు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి. రమణ, ఎస్ఎస్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రాములోరి పెళ్లిరాట



రాట మహోత్సవంలో ఆలయ కమిటీ పెద్దలు

కూర్మన్నపాలెం: కణితి కాళింగవీధిలోని గణపతి సాయినాథ్ సహిత ఆభయ కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీరాములవారి పెళ్లి రాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా తెల్లవారు జాము నుంచి అభిషేకాలు,పూజలు అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించునున్నట్టు కమిటీ పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఉంటుందని ప్రజలంతా స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీనాయకులు బొడ్డ గోవింద్,ప్రగడ వేణుబాబు,శ్రీనివాస్,శంకరరావు,దానప్పలు, నారాయణరావు,సన్యాసిరావు, పూడి శ్రీను,రమేష్ తదితరులు పాల్గొన్నారు.